పంద్రాగస్టు ఏర్పాట్ల పరిశీలన

ఖిలావరంగల్, ఆగస్టు 13: పంద్రాగస్టు వేడుకలకు కోట ముస్తాబవుతోంది. ఖుష్ మహల్ మైదానంలో జాతీయజెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జెండా గద్దె, వేదిక, అతిథులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, స్థానికులు వేడుకలను వీక్షించేలా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు కవాతుకు మార్కింగ్ చేశారు. ఏర్పాట్లను మంగళవారం రాత్రి కలెక్టర్ సత్యశారద, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు. జాతీయ పతాకం ఎగురవేయడానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే, మట్టి కోట ఉత్తర ద్వారం వద్ద ఉన్న మైదానంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఏసీపీ నందిరాం పాల్గొన్నారు. వరంగల్ ఏసీపీ నందిరాం ఖుష్‌మహల్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. భద్రతా పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్‌ఝా

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలి

పోచమ్మమైదాన్/రాయపర్తి, ఆగస్టు 13: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి, కాంగ్రెస్ తప్పులను బహిర్గతం చేయడానికి బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని ప్రారంభించారని పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్పా అన్నారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాయపర్తిలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ విద్యార్థులు బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ జాతీయ పతాకాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు.

జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నాయకులు

'రేషన్' కోసం ఎదురుచూపు

చెన్నారావుపేట, ఆగస్టు 13: ఉప్పరపల్లిలో లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం రోజూ ఎదురుచూస్తున్నారు. గ్రామంలోని షాపు నంబర్-7లో సుమారు 700 కార్డులు ఉన్నాయి. ఈ నెలలో షాపులో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేయగా రెండు క్వింటాళ్ల బియ్యం అదనంగా నిల్వ ఉన్నట్లు తేలడంతో డీలర్ వెంకటేశ్వర్‌పై 6ఏ కేసు నమోదు చేసి షాపును సీజ్ చేశారు. అప్పటి నుంచి రేషన్ అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు రేషన్ పంపిణీ బాధ్యతను పక్క షాపునకు అప్పగించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రేషన్ బియ్యం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఇన్‌చార్జి డీలర్‌ను నియమించి రేషన్ అందిస్తామని తెలిపారు.

ఉప్పరపల్లిలో మూసి ఉన్న రేషన్ షాపు

గుండెపోటుతో ఉద్యమకారుడి మృతి

గిర్మాజీపేట, ఆగస్టు 13: తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన క్రియాశీలక ఉద్యమకారుడు, బీఆర్ఎస్ 26వ డివిజన్ సీనియర్ నాయకుడు, దుర్గేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్, వరంగల్ పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీశ్ సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సతీశ్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, టీ రమేశ్‌బాబు, కుందారపు రాజేందర్, డివిజన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండిబజార్‌లోని నిజాంపుర కాలనీకి చెందిన ఇబ్రహీం మృతిచెందగా, అతడి కుటుంబ సభ్యులను నన్నపునేని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు.

సతీశ్ మృతదేహానికి పూలమాల వేస్తున్న నన్నపునేని

వైద్య సేవల ప్రారంభానికి చర్యలు

- నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- 24 నుంచి మెడికల్ విద్యార్థుల కౌన్సెలింగ్
- అక్టోబర్‌లో ప్రారంభం కానున్న తరగతులు
- ఆస్పత్రి రోడ్డును నిర్మించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట రూరల్, ఆగస్టు 13: నర్సంపేట ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవల ప్రారంభానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సర్వాపురం శివారులో నిర్మాణంలో ఉన్న 250 పడకల జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనుల పురోగతిని మంగళవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. వైద్య కళాశాల, దవాఖానలోని అన్ని బ్లాక్‌ల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కళాశాల నిర్వహణ, ఆస్పత్రిలో సేవలు అందించేందుకు బోధన, బోధనేతర సిబ్బంది, మౌలిక వసతులు, పరికరాలను సమకూర్చుకొని వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య కళాశాలల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సత్య శారద ఆదేశించారు. ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో మెడికల్ విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని, అక్టోబర్‌లో తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. మెడికల్ కళాశాలకు కావాల్సిన అన్ని రకాల అనుమతులు వచ్చినట్లు చెప్పారు. ఆస్పత్రికి వచ్చే ప్రధాన రహదారి బురదమయంగా ఉందని, వెంటనే మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మించాలని సూచించారు. దవాఖాన పరిసర ప్రాంతాల్లో గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. దాదాపు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అక్కడక్కడా మిగిలి ఉన్న సివిల్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, కిషన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశ్, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

వర్ధన్నపేట, ఆగస్టు 13: కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన ఘటన మండలంలోని చెన్నారం శివారు కాశగూడెంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కాశగూడేనికి చెందిన హైదర్, నూర్‌బీ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరగడంతో కోపోద్రిక్తుడైన హైదర్ నూర్‌బీ మెడకు టవల్‌తో ఉరేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి ఆపేందుకు యత్నించగా అప్పటికే నూర్‌బీ మృతిచెందింది. మామునూరు పోలీసులు హైదర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

'కఠినంగా శిక్షించాలి'

నర్సంపేట, ఆగస్టు 13: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన అధ్యక్షుడు డాక్టర్ విజయ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గవర్నమెంట్ మెడికల్ కళాశాల విద్యార్థినిని కళాశాల ఆవరణలోనే లైంగిక దాడి చేసి హత్య చేశాడంటే మహిళల భద్రత ఎంత ప్రశ్నార్థకంగా ఉందో అర్థం అవుతుందని వాపోయారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

రాయపర్తి, ఆగస్టు 13: అదుపు తప్పి లారీ బోల్తా పడిన ఘటన మైలారం శివారులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి ఆలుగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న పశువులను తప్పించే క్రమంలో బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు దవాఖానకు తరలించారు.

మక్కలకు రికార్డు ధరలు

కాశీబుగ్గ, ఆగస్టు 13: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మక్కల ధర రికార్డు స్థాయిలో పలికింది. సంగెం మండలం కొత్తగూడెంకు చెందిన తోట దేవరాజు 257బస్తాలను మార్కెట్‌కు తీసుకురాగా, సురేశ్ ఎంటర్‌ప్రైజెస్ ఖరీదు వ్యాపారి క్వింటాల్‌కు రూ.2,765చొప్పున కొనుగోలు చేశాడు. మంగళవారం 571 క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయపర్తి, ఆగస్టు 13: మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఎంపీవో కూచన ప్రకాశ్ తెలిపారు. మంగళవారం ఆయన మైలారం, గట్టికల్‌లో పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట కార్యదర్శులు పెంచల విజేందర్, గాదె సుమలత, కారోబార్ గూడెల్లి ఉప్పలయ్య ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

ఖానాపురం, ఆగస్టు 13: మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానకు సంబంధించిన రికార్డులు, ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. మహిళలు ఎదుర్కొంటున్న 8 రకాల వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని గుర్తుచేశారు. ఇందులో డయాబెటిస్, రక్తపోటు, రక్తహీనత, ఓరల్ సర్వైకల్, రొమ్ము క్యాన్సర్‌కు స్క్రీనింగ్ టెస్ట్‌లతోపాటు థైరాయిడ్ పరీక్షలు చేస్తారని వివరించారు. దీంతోపాటు సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే గుర్తించి తగిన మందు లు అందజేస్తారన్నారు. మూత్రకోశ, పెల్విక్, నెలసరి సమస్యకు వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. క్యాన్సర్ రోగులు ఉంటే వారిని ఎంఎన్‌జే ఆసుపత్రికి రెఫర్ చేస్తామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడేళ్లలో సీజనల్ వ్యాధులతో పోల్చితే ఈ ఏడాది ఇప్పటివరకు తక్కువ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. అనంతరం మాతాశిశు సంరక్షణపై వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. తర్వాత మండల వైద్యాధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐనపల్లిలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అరుణ్‌కుమార్, జ్యోతి, రుచిత, కల్పన, సీడబ్ల్యూవో రాజయ్య, సిబ్బంది భాస్కర్, సునీత పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

ఎంజీఎంలో సీసీ కెమెరాల ఏర్పాటు

వరంగల్ చౌరస్తా, ఆగష్టు 13: చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లుంది ఎంజీఎం అధికారుల తీరు. ఎంజీఎంలో శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న విషయం వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సీపీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి మట్టెవాడ సీఐ గోపితో కలిసి కెమెరాల ఏర్పాటు పనులను పరిశీలించారు. అత్యవసర విభాగం నుంచి విభాగాల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎంజీఎం డెవలప్‌మెంట్ నిధుల నుంచి కేటాయించిన రూ.5లక్షలతో ఎంజీఎం దవాఖాన ఆవరణ పూర్తిగా కెమెరాల నిఘాలో ఉండేలా నిపుణుల పర్యవేక్షణలో 45 కెమెరాలు బిగిస్తున్నారు.

కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, మట్టెవాడ సీఐ గోపి

ఫైనాన్స్ పేరుతో మోసం

- తక్కువ ధరకు వాహనాలను కొని విక్రయం
- ఈఎంఐలు కట్టకపోవడంతో బాధితుల ఫిర్యాదు
- ముఠా సభ్యుల అరెస్టు

మట్టెవాడ, ఆగస్టు 13: ఫైనాన్స్ పేరుతో మోసం చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సెకండ్ హ్యాండ్ వాహనాలను తక్కువ ధరకు కొని వాటిపై ఉన్న ఫైనాన్స్‌ను తామే కట్టుకుంటామని యజమానులకు అంగీకార పత్రం రాసిచ్చి, ఆ వాహనాలను ఇతర రాష్ట్రాల్లో అమ్ముతున్న వరికొప్పుల దశరథ, దుర్గం సనాతన్, బొమ్మ సురేశ్‌గౌడ్‌తోపాటు వారికి ఫైనాన్స్ సమకూరుస్తున్న అఖిల్‌పై పోలీసులు నిఘా పెట్టారు. దశరథం ముఠా సభ్యులు వరంగల్ డాక్టర్స్ కాలనీకి చెందిన శ్రీనివాసరావుకు సంబంధించి రూ.25లక్షల విలువైన ఎక్స్‌కవేటర్‌ను రూ.3లక్షలకు కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన ఈఎంఐని తామే కడతామని చెప్పి తప్పించుకుని తిరుగుతున్నారు. ఇలా చాలా వాహనాలను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొని స్క్రాబ్ చేసి వాటిని ఇతర రాష్ట్రాలకు అమ్మి వాహన యజమానులను దశరథ మోసం చేస్తున్నాడు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దశరథ, సనాతన్, సురేశ్‌గౌడ్, అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వారిని పట్టుకొని అరెస్టు చేశామని ఎస్సై వెల్లడించారు. బొమ్మ సురేశ్‌గౌడ్, అఖిల్ నుంచి రూ.8లక్షలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

నల్లబెల్లి, ఆగస్టు 13: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం పోస్టుకార్డుల ద్వారా విన్నపం చేశారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంబయ్య నేతృత్వంలో రంగాపూర్ జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు తమ విన్నపాలను కార్డులో రాసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్ఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కాశీబుగ్గ/కరీమాబాద్, ఆగస్టు 13: ఎనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తీసుకెళ్తున్న ఒకరిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ పులి రమేశ్‌గౌడ్ తెలిపారు. రెడ్డిపాలెం జంక్షన్‌లో ఎస్సై పోగుల శ్రీకాంత్ సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో కార్టుమార్క్స్‌నగర్ కాలనీకి చెందిన పలగల చంద్రశేఖర్ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని తనిఖీ చేశారు. అతడి వద్ద 430 గ్రాముల ఎండు గంజాయి లభించిందని సీఐ తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన నాని నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు చంద్రశేఖర్ ఒప్పుకున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్, కానిస్టేబుల్ విజయ్, మహేందర్, నరేందర్, శివశంకర్ పాల్గొన్నారు. అలాగే, మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్న శ్రీరామ్‌ను అరెస్ట్ చేసి 17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాగ్దేవి కళాశాల సమీపంలో అనుమానాస్పదంగా ఒకరు కనిపించడంతో అతడి బ్యాగును పోలీసులు తనిఖీ చేశారు. అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మృతి

నర్సంపేటరూరల్, ఆగస్టు 13: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. వరంగల్ నిజాంపుర చార్‌బౌళికి చెందిన సయ్యద్ ఆఫ్రాన్ హమ్మద్(21) సోమవారం బైక్‌పై వరంగల్ నుంచి చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి వచ్చాడు. పనులు ముగించుకొని సాయంత్రం బైక్‌పై వరంగల్‌కు బయల్దేరాడు. గురిజాల శివారులో చేరుకోగానే లింగాపురానికి చెందిన ముటిక సందీప్ బైక్‌పై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఆఫ్రాన్, సందీప్ కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆఫ్రాన్ మృతిచెందినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

ఆటోనగర్‌లో ఓపెన్ స్కూల్ విద్యా కేంద్రం

పోచమ్మమైదాన్, ఆగస్టు 13: ఆటోనగర్‌లోని ప్రభుత్వ గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా కేంద్రాన్ని హెచ్ఎం, సెంటర్ కో ఆర్డినేటర్ పి.నామణి మంగళవారం ప్రారంభించారు. జిల్లా కో ఆర్డినేటర్ శ్రీమురాల శంకర్‌రావు మాట్లాడుతూ వివిధ కారణాలతో బడి మానేసిన యువతీ యువకులు ఉన్నత విద్యనభ్యసించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. వివరాలకు 9848567369, 81796 62030 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎండీ అస్సర్, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ఎం.భూపాల్, దుర్గం రవి, భాస్కర్, రాజు, సంపత్‌కుమార్, శకుంతల, జ్యోతి, అరుణ్, క్రిష్ణ, రమాదేవి పాల్గొన్నారు.

'పీఎస్‌ల్లో హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి'

పోచమ్మమైదాన్, ఆగస్టు 13: ప్రాథమిక పాఠశాలలకు పది వేల హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి, ఉద్యోగోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్‌బౌళి, మట్టెవాడ, క్రిస్టియన్‌కాలనీ, సుందరయ్యనగర్, గ్రెయిన్ మార్కెట్ పాఠశాలల్లో పర్యటించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు స్వామి, అశోక, వెంకట్, రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్

మత్తడిపై రోడ్డు నిర్మాణం

'నమస్తే' ఎఫెక్ట్

సంగెం, ఆగస్టు 13: ఎట్టకేలకు ఎల్గూర్‌చెరువు మత్తడిపై సీసీ రోడ్డు పనులు చేపట్టారు. మత్తడిపై కొంత కంకర వేసి పనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతల్లో మోకాళ్లలోతు నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో నమస్తే తెలంగాణలో 'రోడ్డా.. ఎస్సారెస్పీ కాల్వా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో మంగళవారం రోడ్డు పనులు ప్రారంభించాడు.

మత్తడిపై సీసీరోడ్డు వేస్తున్న కార్మికులు

బస్టాండ్ సెంటర్‌లో పోలీసుల తనిఖీలు

వరంగల్‌చౌరస్తా, ఆగష్టు 13: వరంగల్ బస్టాండ్ సెంటర్‌లో ఇంతేజార్‌గంజ్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం

- జిల్లాలో 4,500 ఎకరాల్లో సాగు
- పంట సాగు చేసిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి

మొక్క నాటుతున్న జిల్లా ఉద్యాన అధికారి సంగీతలక్ష్మి

వర్ధన్నపేట, ఆగస్టు 13: రైతులు కేవలం వాణిజ్య పంటల సాగుపైనే ఆధారపడకుండా ఆయిల్‌పాం సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీమతి సంగీతలక్ష్మి సూచించారు. వర్ధన్నపేట పట్టణ శివారులోని హేమచందర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఆయిల్‌పాం మొక్కలు నాటించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 4,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసినట్లు వివరించారు. ఇంకా మూడు వేల ఎకరాల వరకు పంటను సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. పంట సాగు కోసం డ్రిప్ ఏర్పాటు చేసుకునేందుకు సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100శాతం, పెద్ద రైతులకు 80శాతం సబ్సిడీపై అందించే అవకాశం ఉందన్నారు. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సబ్సిడీలు అందుతాయని వివరించారు. అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు ఉద్యాన అధికారులు నిత్యం అందుబాటులో ఉంటున్నారని ఆమె వివరించారు. కార్యక్రమంలో రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీ జనరల్ మేనేజర్ సతీశ్‌నాయణ్, వర్ధన్నపేట ఉద్యాన శాఖ అధికారి తిరుపతి, టెక్నికల్ అధికారి రాకేశ్, ఫీల్డ్ ఆఫీసర్లు దేవరాజ్, రిషీ, ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

డీఐఈవో కళాశాల సందర్శన

అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఖిలావరంగల్, ఆగస్టు 13: ఖిలావరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో శ్రీధర్ సుమన్ మంగళవారం సందర్శించారు. కళాశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల అభివృద్ధికి సూచనలు, సలహాలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు ఎం.సురేందర్‌రెడ్డి, జీ రాములు, సీహెచ్.రాజు, కే ప్రసాద్, వీ రజిత పాల్గొన్నారు.

మందపల్లి సొసైటీ సెక్రటరీ సస్పెన్షన్

దుగ్గొండి, ఆగస్టు 13: రుణమాఫీ ప్రక్రియలో అలసత్వం వహించిన మందపల్లి సొసైటీ సెక్రటరీ కొంకటి రాజును సస్పెండ్ చేయాలని వరంగల్ డీసీవోకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాజును సస్పెండ్ చేసి, దుగ్గొండి సొసైటీ సెక్రటరీ భిక్షపతికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

హైదరాబాద్ క్రికెట్ అకాడమీకి సాయిసహస్ర

కాశీబుగ్గ, ఆగస్టు 13: వరంగల్ నగరానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి సాయిసహస్ర హైదరాబాద్ క్రికెట్ అకాడమీకి ఎంపికైంది. వరంగల్ ఓ సిటీ స్టేడియంలో క్రికెట్ కోచ్ సుమన్ వద్ద శిక్షణ పొందిన సాయిసహస్ర అండర్-15 ఉమెన్ లీగ్‌కు ఎంపికైంది. బాలికను డీఎస్‌డీవో సత్యవాణి అభినందించారు.

సీహెచ్‌సీలో సదరం క్యాంపు

వర్ధన్నపేట, ఆగస్టు 13: మండలకేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జిల్లాలోని 60 మందిని వైద్యులు పరీక్షించారు. అనంతరం డీఆర్‌డీఏ అధికారులు మాట్లాడుతూ అర్హులకు త్వరలోనే సదరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

నేడు ఓ సిటీ స్టేడియంలో క్రీడా పోటీలు

కాశీబుగ్గ, ఆగస్టు 13: పంద్రాగస్టు సందర్భంగా జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళ, పురుష ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధిక